క్లుప్తంగా

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): మండలంలోని లొంకె హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. స్థానిక భక్తుల సౌకర్యార్థం రూ.10లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల, బీఆర్‌ఎస్ నాయకులు విఠల్ రావు, నాగేందర్‌రావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, నర్సింలు యాదవ్, గుండన్న, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం మూసాపేట్‌కు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు యాదుల్లా, పీఏసీఎస్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



అందజేసిన బ్యాగులతో విద్యార్థులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సేవోద్ధం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కార్తీక్ తన పుట్టిన రోజును పురస్కరించుకొని 28మంది విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వోతె చంద్రశేఖర్, ఉపాధ్యాయులు హన్మయ్య, నర్సింహులు, దత్తు, లక్ష్మణ్, పాండు, భూమయ్య పాల్గొన్నారు.

ఖేడ్ ఎస్‌ఐగా ఏడు కొండలు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ

నారాయణఖేడ్: ఖేడ్ ఎస్‌ఐగా ఏడుకొండలు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన వెంకట్‌రెడ్డి రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న ఏడుకొండలు ఖేడ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన వెంకట్‌రెడ్డితో పాటు ఏడుకొండలను పలువురు నాయకులు పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

ఉత్తమ ఫార్మసిస్టుగా జబ్బార్

కల్హేర్(నారాయణఖేడ్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో కల్హేర్ పీహెచ్‌సీ ఫార్మసిస్టు ఎండీ జబ్బార్ బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టు జబ్బార్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. ఉత్తమ అవార్డు అందించడంతో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలో బీరప్ప, మల్లన్న, విశ్వకర్మ అలయాల నిర్మాణాలకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ఆలయాలకు విలువైన భూమిని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్డీ పోరాట ఫలితమే పెన్షన్ల పెంపు

సదాశివపేట(సంగారెడ్డి): ఎన్‌పీఆర్డీ పోరాట ఫలితంగానే ప్రభుత్వం వికలాంగులకు పెన్షన్ రూ.1000 పెంచిందని ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షులు తలారి గోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌పీఆర్డీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు జాతీయ హక్కుల జాతీయవేదిక ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి ధరల పెరుగుదలకు అనుగుణంగా వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గఫూర్, నాయకులు మహిపాల్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు సహకారం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బండ్లగూడ పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బండ్లగూడ పరిధిలో ఇప్పటివరకు ఐదు ఆలయాలను నిర్మించినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, నగేష్‌యాదవ్, శ్రీధరాచారి, గోపాల్, కాంతారావు, విజయ్, సురేష్, చంద్రశేఖర్, పద్మ, గోరీ, మేరీ పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌లో బీరప్ప దేవాలయం

పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన బీరప్ప స్వామి దేవాలయం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. సర్పంచ్ బాలమణి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, ఉపసర్పంచ్ శోభకృష్ణరెడ్డి పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరీ ఆలయ భూమిపూజలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

డివిజన్ పరిధిలో కన్యకాపరమేశ్వరి దేవాలయం

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయం ఎదురుగా నూతనంగా నిర్మించతలపెట్టిన కన్యకా పరమేశ్వరీ దేవాలయం భూమి పూజకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

రామ మందిర నిర్మాణ పనులకు శంకుస్థాపన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని దోమడుగులో నిర్మించతలపెట్టిన రామమందిర నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మె ల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలతో పాటు ప్రార్థనా మందిరాలను నిర్మించేందుకు సహకారం అందిస్తానని తెలిపారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ రాజశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు హుస్సేన్ పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమపై చర్యలేవి ?

- చెట్లు నరికేసినా పట్టించుకోరా?
- అసంపూర్తిగా మిషన్ భగీరథ పనులు
- సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కాలుష్య కారక పరిశ్రమలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారని సభ్యులు వాపోయారు. మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎవరెస్ట్ రసాయన పరిశ్రమతో వాయు, జల కాలుష్యం ఏర్పడి దాదాపుగా 6గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కోల్కూర్ సర్పంచ్ భూపారెడ్డి వాపోయారు. అదేవిధంగా డంపింగ్ యార్డులోని మురుగునీరు చెరువుల్లోకి చేరి చేపలు చనిపోతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని వెంకటాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్ అధికారులను డిమాండ్ చేశారు. నిజాంపూర్ రోడ్డులో అవెన్యూ ప్లాంటేషన్ ఓ వెంచర్ యజమాని విద్యుత్ లైన్ కోసం చెట్లను ఇష్టారాజ్యంగా నరికేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని. చెట్లను నరికేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజాంపూర్ ఎంపీటీసీ మాధవరెడ్డి, కోల్కూర్ సర్పంచ్ భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. రూ.16 సంవత్సరాల ఇంటి పన్నుల బిల్లులను అందిస్తే తప్పు రిజిస్ట్రేషన్లు చేయను అంటూ సబ్ రిజిస్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆత్మకూర్ సర్పంచ్ గంగన్న అధికారులను కోరారు.విద్యుత్ ఏఈ సమావేశానికి రాకుంటే తమ గ్రామాల్లోని సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని కోల్కూర్ సర్పంచ్ భూపాల్ రెడ్డి,ఎట్టిగడ్డసంఘం సర్పంచ్ నర్సింలు,ఎంపీటీసీ సభ్యురాలు మమత అధికారులను ప్రశ్నించారు.ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా వెంటనే జారీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆత్మకూర్ సర్పంచ్ గంగన్న కోరారు.ఉపాధి హామీ కూలీలా పెండింగ్ కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని సభ్యులు సభ్యులు సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పూజ, జడ్పీటీసీ సభ్యురాలు గడీల శ్రీదేవిరాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ యాదమ్మ

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొండాపూర్(సంగారెడ్డి): పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల పోరాట కన్వీనర్ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బస్సుయాత్ర కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలైనా పేదల సొంత ఇంటి కల నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు ప్రభుత్వ స్థలంలో 100 గజాల ఇంటి నిర్మాణం కోసం గుడిసెలు వేస్తే పేదలపై లాఠీచార్జి చేయిస్తూ గుడిసెలు ఖాళీ చేయించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలకు 100 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాత ఈ నెల 18న ప్రారంభమై సంగారెడ్డికి ఈ నెల 25న వస్తుందని ప్రజలందరూ అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నర్సింలు, యాదవ రెడ్డి, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

గృహ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సంగారెడ్డి టౌన్: గృహ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని మెడ్వాన్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని మెడ్వాన్ కార్యాలయంలో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ కార్మికులకు కనీస వేతనం చెల్లించడంతో పాటు ఒక సమగ్ర చట్టం అమలులోకి తీసుకురావాలన్నారు. పనిచేసే యజమానుల గృహాలను పని ప్రదేశాలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో స్వప్న, టౌన్ లెవెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నాశ్రీన్ బేగం, కార్యదర్శి పర్వీన్ బేగం పాల్గొన్నారు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలంలోని పాటీ–ఘనపూర్ సర్వే నెంబర్ 193లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా కంచెతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన కలెక్టర్, తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కో–కన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల సహకారంతో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారని, స్వాతంత్ర్య సమరయోధులు పేరుతో దొంగ సర్టిఫికెట్లు సృష్టించి ఆ భూమిని వశం చేసుకునే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయంపై గతంలో తహసీల్దార్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ప్రభుత్వ భూమి వద్ద కంచెతో పాటు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగసాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం భూమి వద్ద హెచ్చరిక బోర్డు

ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బడిబాటలో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని నిజాంపూర్ ప్రాథమిక పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. కొత్తగా ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన 11 మంది విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రుద్రప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురార్జీ, ఉపాధ్యాయులు రామకృష్ణ, ప్రవీణ్ కుమార్ అక్షరాభ్యాసం చేయించారు. ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు హాజరుతీసుకున్నారు. అంతకుముందు సరస్వతి పూజ చేసి పిల్లలకు పలకలు, బలపాలు అందజేసి చాక్లెట్స్, బిస్కెట్స్ పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ స్వప్న, అంగన్వాడీ ఆయా రుక్మిణీ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

హరితోత్సవాన్ని విజయవంతం చేయాలి

రాయికోడ్(అందోల్): హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఏపీఓ విష్ణువర్ధన్ అన్నారు. రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈ నెల 19న నిర్వహించే హరితోత్సవంలో ప్రజలను, రైతులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై వెళ్తున్న సజ్జారావుపేట తండాకు చెందిన గోపాల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

భీంరావుపాటిల్‌కు ఉత్తమ సేవా పత్రం

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సదాశివపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్ట్ భీంరావుపాటిల్ ఉత్తమ సేవా పత్రం అందుకున్నారు. సంగారెడ్డి ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భీంరావుపాటిల్‌కు కలెక్టర్ శరత్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రం అందుకున్నారు.

అనుమానస్పదంగా బాలిక మృతి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలో బుధవారం అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందింది. సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం .. పట్టణానికి చెందిన బానోత్ కుమార్తె అఖిల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని రేకుల రాడుకు చున్నీతో ఉరి వేసుకుంది. తండ్రి బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

జహీరాబాద్ టౌన్: పీఎఫ్ సమస్యను పరిష్కరించి జీతాలు ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ సంకేతిక సమస్య కారణంగా పీఎఫ్ సమస్య తలెత్తిందని తెలిపారు. ప్రతి నెల అధికారులు పీఎఫ్, ఈఎస్‌ఐకి సంబంధించి డబ్బులు చెల్లిస్తున్నా పీఎఫ్ రుణం తీసుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. పీఎఫ్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారిని పిలిపించి సమస్యను పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యశోదమ్మ, కామయ్య, రాజు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు అందుతాయని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హెల్త్ డే సందర్భంగా బుధవారం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ డెలివరీ అయిన మహిళకు కేసీఆర్ కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మానయ్యకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ నివాళి



సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూరు మండలంలోని చక్రియాల్ గ్రామానికి చెందిన క్రాంతిసేన సభ్యుడు రవి తండ్రి కొర్పోల్ మానయ్య బుధవారం మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్ వారి నివాసానికి వెళ్లి మానయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు ఆయన వెంట వైస్ ఎంపీపీ వైస్ గాజుల వీరేందర్, సర్పంచ్ కిష్టారెడ్డి, క్రాంతిసేన సభ్యులు ఉన్నారు.

విత్తనాల పంపిణీ

జహీరాబాద్: ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రంలో భాగంగా సంగారెడ్డిలోని ఏరువాక కేంద్రం వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం రైతులకు కంది డబ్ల్యూఆర్‌జీ 225, 95 రకం, సోయాబీన్ ఏఎస్‌బీ 15 రకం విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సరిత, ఏఈఓ ప్రదీప్‌కుమార్, రైతులు మల్లికార్జున్, సంగారెడ్డి, సంగమేష్ పాల్గొన్నారు.



విత్తనాలను అందజేస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో వీరాంజనేయ, నవగ్రహ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు సోమవారం జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వర సిద్ధాంతిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

◆ విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నారాయణఖేడ్: మండల పరిధిలోని కిందితండాకు చెందిన నేనావత్ పోమ్యానాయక్‌కు చెందిన ఎద్దు బుధవారం పీర్లతండా శివారులో మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.1.10లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

◆ ధర్మ సమాజ్ పార్టీలో చేరిక

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌కు చెందిన న్యాయవాది అలిగే జీవన్‌కుమార్ ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ)లో చేరారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు విశారథన్ మహారాజ్ జీవన్ కుమార్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ గంగమ్మ ఆలయ పనులు ప్రారంభం

నారాయణఖేడ్: మండల పరిధిలోని వెంకటాపూర్ పెద్దచెరువులో గంగమ్మగుడి నిర్మాణానికి బుధవారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ ముదిరాజ్ సంఘం గంపల్లి నారాయణ, ఇతర బాధ్యులు దొడ్ల సాయిలు, గ్రామపెద్దలు మల్గొండ, గంగయ్య, సాయిలు, మదాసు, మశ్చందర్ తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

◆ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాంచందర్ రాజనర్సింహా

జహీరాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాంచందర్ రాజనర్సింహా నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ కార్యవర్గంలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రాజనర్సింహా మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి జయశ్రీ, పార్టీ ముఖ్య నాయకులు అట్లూరి రామక్రిష్ణ, నౌబాద్ జగన్నాథ్, సుధీర్‌కుమార్, జనార్ధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

◆ తవ్వకాల్లో బయటపడిన అమ్మవారి విగ్రహం

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని సిరిపురం శివారులో బుధవారం నూతనంగా వన దుర్గామాత ఆలయం నిర్మించేందుకు తవ్వకాలు చేపట్టగా పురాతన అమ్మవారి రాతి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

పల్లె ప్రగతిని విజయవంతం చేయాలి

పుల్‌కల్(అందోల్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ పట్లోల్ల చైతన్య విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, విద్యాసాగర్‌రెడ్డి, గుండు రవి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, వైద్యులు, ఫార్మాసిస్ట్ భీంరావు పాటిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలందరికీ రుణం వర్తింపజేయాలి

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని బీసీ కులాలందరికీ వర్తింపజేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి అన్నారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దారు శంబిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని కులాలకు మాత్రమే రూ.లక్ష ఆర్థిక సహాయం చేయడం సరికాదన్నారు. రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమై కుల, ఆదాయ ధృవపత్రాల మంజూరులో సర్వర్‌డౌన్ కారణంగా జాప్యం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేవరి తేదీని మరో పది రోజులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రావు పాటిల్ పాల్గొన్నారు.

◆ ప్రహరీ కూల్చివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువులో ఓ పట్టాదారుడు పట్టా శిఖంలో బుధవారం ప్రికాస్టింగ్ గోడను నిర్మించాడు. దీంతో విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ సంతోషిణి, ఆర్‌ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి వెళ్లి వాటిని కూల్చివేశారు.

◆ బండి సంజయ్‌ను కలిసిన గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికైన గోదావరి అంజిరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్‌లో కొత్తగా నిర్మాణం చేపట్టిన రాంమందిరంలో విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, సర్పంచ్ పెరుమాండ్ల లచ్చవ్వ, ఎంపీటీసీ సంగప్ప, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ హస్టల్‌లో చేరండి: **మునిపల్లి(అందోల్):** కంకోల్ ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరాలని హస్టల్ వార్డన్ దుర్గేష్ బుధవారం విద్యార్థులను కోరారు. హస్టల్‌లో చేరే విద్యార్థులకు ఉచిత భోజనం, దుస్తులు, దుప్పట్లు అందజేయనున్నట్లు తెలిపారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు హస్టల్‌లో ఉండి చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ పట్టణ కార్యాలయం ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆ పార్టీ పట్టణ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కొండపూర్ జగన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ సంగమేశ్వర జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ శ్రీపతిరావు, కౌన్సిలర్ రమేష్, జిల్లా కార్యదర్శి మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితుల భూమిని కాపాడాలి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామంలో దళితుల భూమి కాపాడాలంటూ ఆ గ్రామ దళితులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 50 ఏళ్లుగా తాము కాస్తులో ఉన్న భూమి కొందరు ఆక్రమించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరారు.